# 15. బుద్ధిమంతుడు

"చిన్నప్పుడు నేను చాల బుద్ధిమంతుడిని" అన్నారు కుటుంబరావు గారు.

అతను నా కన్న ఆరేళ్లు సీనియరు. ఆఫీసు సూపరెంటెంట్‌గా పనిచేసి రిటైరయారు. నేను అతని అసిస్టెంటుగా పనిచేసే వాడిని. అతను ఉద్యోగ విరమణ చేసిన తరువాత, నేను అతని జాగాలో ప్రమోషను తీసుకొని, కొన్నాళ్లు పనిచేసి ఈ మధ్యనే విశ్రాంతి తీసుకున్నాను.

మాయిళ్లు కూడా పక్కపక్కలనే, కోఆపరేటివ్ కాలనీలో ఉన్నాయి. నిజానికి అతనే నాకు తన పక్కప్లాటును యిప్పించి సహాయం చేశారు.

"చాల గొప్ప జోకే వేశారు." అన్నాను నేను.

"ఇది నిజమైన సంగతి. ఇందులో అబద్ధం లేదు."

నా మాటలకు అతను తప్పుపడతారని అనుకున్నాను.

"ఏదో సరదాకి అంటున్నారని అనుకున్నాను." అన్నాను.

మేమిద్దరం సాయంకాలవేళ, పార్కులో కూర్చొని మాట్లాడుకుంటున్నాము.

"లేదు. ఇది నిజమైన సంగతి. నేను చాల బుద్ధిమంతుడిగా ఉండేవాడిని. పెద్దలమాట వినడం, అబద్ధాలాడకపోవడం, బుద్ధిగా చద్దన్నం తిని చదువుకోడం ఇంకా, ఇంకా చెప్పవలసివస్తే పొద్దున్నే స్నానం చేసి, బొట్టు పెట్టుకొని, ప్రార్థన శ్లోకాలు చదవడం, పొత్తిలాగుతొడుక్కొని భోజనం చేయడం, అది చిరిగిపోతే తడిగావంచా కట్టుకొని భోజనం చేయడం, ఇటువంటి చాల చాల మంచిపనులు చేశాను. ఇంట్లోవాళ్లు, పై వాళ్లు, మొదట చాటుగాను తరువాత నా ముఖం ఎదుట నా గురించి చెప్పుకునేవాళ్లు"

"అంటే మీరు చెప్పింది అక్షరాల నిజమన్నమాట?"

"అవును. ఇంట్లోనే కాక స్కూలులో కూడా నేను ఈ విధంగానే ఉండేవాడిని. చాల శ్రద్ధగా చదివే వాడిని.

"చాల మంచి మార్కులే వచ్చాయనుకుంటాను?"

"చిన్న తరగతులలో బాగానే వచ్చాయి. పై తరగతులో సగటు మార్కులతో పాసయాను. అయినప్పటికీ టీచర్లందరూ నన్ను చాల అభిమానంగా చూసుకునేవారు."

"మార్కులు హెచ్చుగా రాకపోవడానికి కారణమేదేనా ఉందా?"

"నాకు పన్నెండోఏటే ఉపనయనం చేశారు. పంచశిఖలతో, చెవులకు కట్టిన పోగులతో, వేలికి బంగారపు ఉంగరంతో నేను చాల ముద్దొస్తూ ఉండేవాడినని మా అమ్మ అంటుండేది. ఉపనయనమయిన దగ్గిరనుంచీ, ఏకాదశికి, పున్నానికి ఉపవాసాలున్నవాళ్లు, మర్నాడు బ్రాహ్మణాత్యానికి పిలిచేవారు. సుష్టుగా భోజనమే కాకుండా, అర్థో రూపాయో

దక్షిణకూడా దొరికేది. చదువుకన్న ఇటువంటి పై పనులలో కాలం వెళ్లబుచ్చడమే బహుశా మార్కులు తగ్గడానికి కారణమయి ఉంటుంది."

"పోని, స్కూలు ఫైనలులో బాగా వచ్చాయనుకుంటాను."

"చాల కష్టపడి చదివాను. ఒకటి రెండు సబ్జక్టులలో అరవైకి పైగా వచ్చినా, మిగతావాటిలో నలభైలు వచ్చి మొత్తానికి పాసయాను."

"చాల బాగుంది."

"మానాన్న గారికి విశాఖపట్నం బదిలీ అయింది. చాల యిబ్బందులు పడి మా వాళ్లు నన్ను కాలేజీలో చేర్చారు."

"అప్పటికి ఒకదారిలో పడ్డారనుకుంటాను."

"నేను అందరినోట్లో మంచివాడిననిపించుకోడానికి మరింతగా కృషి చేశాను."

"దానివల్ల ఏదైనా ప్రయోజనముందా?"

"నిజాయితీకి కుటుంబరావు మారుపేరని అందరూ అనుకునేవాళ్లు."

"ఏదో కీర్తికాంక్ష!"

"కీర్తి కోసమనికాదు. నాలో మరేదీ ప్రతిభలేదన్న సంగతి మీరీసరికి గ్రహించే ఉంటారు. ఆ లోటు కప్పిపుచ్చడానికి ఈ ప్రలోభానికి లోనయాను."

"చాల బాగుంది."

"నిజానికి ఇంటో వాళ్లని అల్లరి పెట్టి కాలేజీలో చేరాను. టెర్మ్ ఫీజుకట్టడం చాల కష్టమయింది. ఒక పరిస్థితిలో చదువుమాని వేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి."

"మరి....?"

"అప్పుడాక ఆపద్బాంధవుడు అడ్డు పడ్డాడు. అతనూ మా దగ్గర బంధువు. భూములు, యిళ్లు కలవారాయన. కోర్టు పనిమీద అప్పుడప్పుడు అతను విశాఖపట్నం వచ్చేటప్పుడు మయింట్లోనే బసచేసేవారు. అతనికి నేనంటే చాల అభిమానం. తన కొడుకులు నాలాగ ఉండాలని అతను కోరేవారు. నా చదువుకు అంతరాయం కలుగుతున్నట్లు అతను తెలుసుకున్నారు. నా చదువుకయే ఖర్చులు తాను భరిస్తానని ముందుకు వచ్చారు. పుస్తకాలు, బట్టలు, పరీక్ష ఫీజు అంతాయిస్తానన్నారు. తన కొడుకులు బాగుపడక పోయినా నేను బాగుపడితే సంతోషిస్తానన్నారు. ఆ రోజులలో, ఇంటరులో మంచి మార్కులు వస్తే అటు యింజనీరింగులోనో, యిటు మెడిసన్‌లోనే సీట్లు దొరికేవి. నేను ఎంతపై చదువు చదివినా సహాయం చేస్తానని అతను హామీ యిచ్చారు."

"అటువంటివారు దొరకడం కష్టమే."

"అన్నీ బాగానే ఉన్నాయి. నేను చాల కష్టపడి చదివాను. అయినా మూడో పార్టు

పోయింది. అదృష్టం కలిసిరాలేదని అందరూ అన్నారు."

"చాల గట్టిదెబ్బే!"

"గట్టిదెబ్బకాదు, చావుదెబ్బ! చాలశ్రమపడి సెప్టెంబరులో ఆ పార్టు పాసయాను. మా వాళ్లకి కాళ్లుపీకాయి. నాకు సహాయం చేస్తున్న శర్మ బాబాయిగారికి అవకాశం యివ్వకుండా నేను చేశాను. అందుచేత, ఉద్యోగమొకటి చూసుకొని చేరిపోయాను."

"అలుపిమ్మట?"

"ఉద్యోగమొక్కటీ జీవనాధారమని, నిజాయితీగా పనిచేస్తేనేకాని అది నిలవదని మొదటి నుంచి ఒక అభిప్రాయానికి వచ్చి, బుద్ధిగా వినయంగా నమ్రతతో పనిచేసుకునేవాడిని,"

"అంటే ఈ నిజాయితీ అని..."

"వాచా, కర్మణా, అన్ని విధాలుగా కష్టపడ్డాను."

"అందుచేత అందరినోట ఔరా అనిపించుకున్నారు."

"అది తప్పనిసరి అయింది. బతకాలంటే అదొక్కటే మంచిమార్గమని తెలుసుకున్నాను."

"చాల బాగుంది."

"చిన్నప్పటినుంచీ, ఒకే వరవడిలో నడిచాను. నేను అందరివంటి సామాన్యుడనని నిగర్విగా చెప్పుకున్నాను. పనులు చేసిపెడితే, పార్టీలు కాయోపండో యిస్తే, మిఠాయో పూతరేకులో తెస్తే తీసుకునే వాడిని. కాని, నా మనసులోని బాధకు యివేవి కారణాలు కావు."

"మరి?"

"నాకు వివాహమయింది. మాకు ఆర్థికమైన యిబ్బందులున్నా, లోకం కోసం నేను కట్నం పుచ్చుకోలేదు."

"ఎలా చేసినా మంచిపనే కథా!"

"నేను హాయిగా సంసారం చేసుకుంటుంటే, ఒక ఆదివారం ఉదయం మా ఆప్త బంధువు శర్మగారు, అతని మూడవ అబ్బాయి శివుడు మాయింటికి వచ్చారు. స్నానాలు కాఫీలు, టిఫిను అయిన తరువాత శర్మగారు తాను వచ్చిన పని గురించి చెప్పారు. శివుడికి నౌకాదళం స్టోర్సులో గుమస్తా ఉద్యోగం దొరికింది. వేరేగది తీసుకుని వాడిన ఉంచడానికి మరే అభ్యంతరమూలేదు. కాని, ఎవరేనా పెద్ద వాళ్ల పజ్జనువాడుంటే, నిశ్చింతగా పని చేసుకోడానికి వీలవుతుంది. వాడో యింటివాడయే దాకా మాతోపాటు వాడిని ఉండనియ్యమని అతను కోరారు."

"సహజమే అది."

"శివుడు కొంచెం విచ్చలవిడిగా తిరగవలసిన కుర్రాడు. నాతో కొన్నాళ్లుంటే స్థిరపడతాడని అతని నమ్మకం."

"నిజమే."

"శివుడు నాతో ఉన్నందుకు నెలకో మూడు వందల రూపాయలిస్తాడని, ప్రస్తుతం ఖర్చుకు ఒక అయిదు వందలు ఉంచమని అతను నాకియ్యబోయారు. నేను పుచ్చుకోలేదు. శివుడు నా తమ్ముడివంటివాడు. ఆ విధంగా శర్మబాబాయిగారికి సహాయం చేస్తే నా ఋణం తీర్చుకున్న వాడినవుతానని చెప్పాను."

"అవును."

"శివుడు నాతో ఉన్నందుకు నాకేమీ కష్టమనిపించలేదు. మా వీధి గదిలోఉండేవాడు. నాతోపాటు తొమ్మిది గంటలకు భోజనం చేసి, సాయంకాలానికి ఉద్యోగం నుండి వచ్చేవాడు. సాధ్యమైనంతవరకు మాకు యిబ్బంది కలుగకుండా, ఇంట్లోమనిషయాడు."

"పెద్దకుటుంబం నుంచి వచ్చిన కుర్రాడుకదా!"

"ఏదయితేకానివ్వండి, నాకు మాత్రం ఏకష్టమూ ఉండేదికాదు. ఆరునెలలు, తొమ్మిది నెలలు, ఒక సంవత్సరం తొందరలో గడిచిపోయాయి."

"తరువాత?"

"ఒకనాటి సాయంకాలం మామూలు వేళకు శివుడు ఉద్యోగం నుంచి రాలేదు. నాకేం తోచలేదు. బహుశా యింటికి వెళ్లాడని అనుకున్నాం. కాని, మూడోరోజు ఉదయనికి మా బాబాయి శర్మగారు వచ్చి పడ్డారు. ఆయని చాల గాభరాగా ఉన్నారు. వస్తూనే ఆయన అడిగారు, 'కుటుంబరావు! శివుడు స్టోర్సులో దొంగతనం చేశాడని చాల విలువయిన సామాన్లు పట్టుకుపోయాడని, రిమాండులో ఉంచామని వాళ్ల అధికారి నాకు టెలిగ్రాము యిచ్చాడు. ఉన్నపాళంగా వచ్చాను.' 'ఏసామాను దొంగతనం చేశాడు?' అడిగాను నేను 'రగ్గులట!' 'నాతో ఎప్పుడూ చెప్పలేదే!' 'ఓయి కుటుంబరావు! ఎవరైనా దొంగతనం చేశామని చెప్తారా! ఏదయితేనేం, నేను వెంటనే వెళ్లి విషయం కనుక్కొని, అధికార్లను కలిసివస్తాను. నేను వచ్చేవరకు నువ్వు, యింటి దగ్గిరుండు?' అతను కాఫీకూడ తాగకుండా వెళ్లిపోయారు."

"ఆ కుర్రాడెందకీ పనిచేశాడు?"

"నాకు కూడా అదే సందేహం కలిగింది. వీధి గదిలోకి వెళ్లి శివుడి ట్రంకుపెట్టి తలుపుతీశాను. దానికి వాడెప్పుడూ తాళం వేసినట్లులేదు, అందులోని రగ్గులను చూడగనే నా కళ్లు జిగేలుమన్నాయి. నౌకాదళంలో పెద్ద అధికారులు వాడే రగ్గులవి. ఇంగ్లండులో తయారయినట్లు లేబిళ్లమీద ఉంది. ఆ రంగులు చాల అద్భుతంగా ఉన్నాయి. తాటిమీద చేయివేస్తే ఎంతోమెత్తగా ఉన్నాయి."

"ఎంత ధైర్యంగా ఆపని చేశాడు!"

"అదేమరి. నేను వాటివేపు ఒకపావుగంట వరకు చూశాను. దీర్ఘంగా నిట్టూర్చాను. నాపంటి సామాన్యుడికి వాటివేపు చూసే అర్హత కూడాలేదు."

"ఆ సంగతి నిజమే."

"బాబయ్య శర్మగారు రమారమి పన్నెండు గంటలకు తిరిగి వచ్చారు. 'ఏమయింది, బాబయ్యగారూ?' నేనడిగాను. 'నేను పెద్దవాడికాళ్లు పట్టుకున్నాను. రగ్గులన్నీ తెచ్చియిస్తే ఆలోచిస్తానన్నాడు. శివుడి ట్రంకు పెట్టేలోనే అవన్నీ ఉన్నాయట.' అతను భోజనమేనా చెయ్యకుండా ఆటోలో పెట్టిపట్టుకొని వెళ్లిపోయారు. ఆ రోజు పొద్దున్నపూట మాత్రమే నేను ఆఫీసుకు సెలవు పెట్టాను. ఒంటిగంటన్నరకు బయలుదేరబోతూఉంటే మా బాబయ్య గారు గాభరాగా వచ్చారు."

"ఏమయింది?"

'కుటుంబరావ్! ఈ పెట్టేలో పదిరగ్గులు పెట్టానని శివుడంటున్నాడు. తీరాచూస్తే ఎనిమిదే ఉన్నాయి. నీకు వీటి సంగతి ఏమైనా తెలుసా?' అతను అడిగారు.

"మీరేం చెప్పారు?"

"అతనునాకళ్లల్లోకి లోతుగా చూస్తూ ప్రశ్నించారు. ఒక్క పదినిమిషాలు ఇద్దరం అలాగే ఉండిపోయాం. తరువాత నేను నెమ్మదిగా అన్నాను. 'బాబాయిగారు! మీరు ఇందాకా చెప్పే వరకు ఆ ట్రంకులో రగ్గులున్నాయని నాకు తెలియదు. శివుడి పీకలమీదికి వస్తేనాకు కాదా!' అన్నాను. అతను మరోసారి నాకళ్లలోకి సూటిగా చూసి వెళ్లిపోయారు."

నేను ఆలోచిస్తున్నాను. ఏదో సందేహం – కుటుంబరావు గారే తిరిగి చెప్పడం మొదలుపెట్టారు.

"మా బాబయ్యగారు పచ్చి మంచినీళ్లుకూడా మాయింట ముట్టలేదు. అటుపిమ్మట అతనుగాని, శివుడుగాని మా గడప తొక్కలేదు."

"ఇంతకీ ఏమయింది?"

"మా హెడ్ గుమస్తాగారి అబ్బాయి శివుడితో కలిసి పనిచేస్తున్నాడు. ఒకరోజు అతను ఏదోపనిమీద వాళ్ల నాన్నగారి దగ్గిరికి వస్తే అడిగాను శివుడి సంగతి. పది రగ్గులు తిరిగి తెస్తే అధికారి సహాయం చేసి ఉండేవాడు. ఉద్యోగం తీసివేయడంతో సరిపెట్టేవాడు. రెండు రగ్గులు పోవడంతో అతను మరేమీ చెయ్యలేకపోయాడు. శివుడికి మూడు నెలలు జైలు శిక్ష విధించారు.' అప్పుడు నేనడిగాను, 'శివుడేమేనా అన్నాడా?' 'శివుడి నాన్నగారు మీ యింటి నుండి, రెండోసారి, వట్టి చేతులతో వచ్చారు. కుటుంబరావుకేమి తెలియదన్నట్లు అతను చెప్పారు."

"మరిశివుడేమన్నాడు?" నేను ప్రశ్న వేశాను.

"శివుడు చిన్నవవ్వునవ్వాడట. అంతకుమించి ఏమీఅనలేదు."

"కథ ఇంతటితో అయిపోలేదనుకుంటాను." కొంచెంసేపు ఆలోచించి నేనన్నాను.

"అయిపోలేదు. ఒక అయిదు సంవత్సరాల తరువాత, మంచి చలికాలంలో, సందుగు పెట్టె అడుగున, కర్పూరపు ఉండల మధ్య చాల జాగ్రత్తగా దాచిన, లేతనీలపు రంగులో, గళ్లతో దివ్యంగా ఉన్న రెండు రగ్గులలో ఒకటిపైకి తీశాను."

ఆ మాటలు విని నేను మ్రాన్పడిపోయాను.

కుటుంబరావుగారే తిరిగి మాట్లాడారు.

"ఆ రగ్గు ఒంటినిండా కప్పుకున్నాను."

నా నోట్లో పచ్చి వెలక్కాయ కుక్కినట్లుంది.

"ఏదో చెప్పలేని సుఖం....

అతని ముఖంలోకి చూస్తున్నాను.

"ఆశించాను. కాని, నావంటి నిండా గొంగళి పురుగులు, బల్లులు, తేళ్లు, మండ్రగబ్బలు, పాములు, ప్రపంచంలో గల అన్ని రకాల సరీసృపాలు పాకడం మొదలు పెట్టాయి. ఒక్కగంతువేసి రగ్గును దూరంగా పారేశాను."

"తరువాత."

"ఇంకే చెప్పడం - ఆ రగ్గులవేపు చూస్తేఒట్టు - రగ్గులు కాలగర్భంలో కలిసిపోయాయి. కాని, ఆనాటి అనుభవం తిరుగులేనిది. నేను చేసిన పాపానికి నిష్కృతి లేదు."

పార్కులో దీపాలు ఆరిపోయాయి.

ఇద్దరం లేచాం. పంచెకొంగుతో అతను కళ్లు ఒత్తుకుంటుంటే అతనిని యింటివేపు నడిపించాను.

(2009 స్వాతి సపరివార పత్రిక నిర్వహించిన సంక్రాంతి కథల పోటీలో, ప్రత్యేక బహుమతి పొందినది.)